క్లుప్తంగా

పోచమ్మతల్లికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే.

ఇబ్రహీంపట్నం రూరల్: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పోచమ్మతల్లికి తన స్వగ్రామం ఎల్మినేడులో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. సీఎం కేసీఆర్ నేడు ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితా ప్రకటించడం, మొదటి జాబితాలో ఆయన పేరు రావడంతో ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. ఆయనతో పాటు న్సిపాలిటీ వైస్ చైర్మన్ యాదగిరి, యాచారం మాజీ జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, నిట్టు జగదీష్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు చేయూత



సిమెంట్ అందజేస్తున్న సభ్యులు

తలకొండపల్లి: నిరుపేదల ఇళ్ల నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనిస్తూ వారి జీవితాల్లో వెలుగును నింపుతున్నాడు. మండలంలోని లింగరావుపల్లికి చెందిన వెంకటయ్య నూతన ఇంటి నిర్మాణానికి ఆదివారం ట్రస్టు సభ్యులచే సిమెంట్, స్టీల్, కాంక్రీట్, ఇటుక, తదితర మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు ఇమ్రాన్, తదితరులున్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల విచారణ



విచారణ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఇబ్రహీంపట్నం: గృహలక్ష్మి దరఖాస్తుదారుల విచారణను అధికారులు వేగవంతం చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని 14 గ్రామాల నుంచి 1110 దరఖాస్తులు, స్థానిక మున్సిపాలిటీ పరిధిలో 511 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం ఆదివారం ఇంటింటికి వెళ్లి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన చేస్తున్నారు. మున్సిపాలిటీలో వార్డుల వారీగా సిబ్బందిని నియమించారు. అలాగే, మండలంలోని ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు విచారణ చేపట్టారు.


ఘనంగా నాభిశిలా పునఃప్రతిష్ఠ ఉత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీపీ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రాయపోల్‌లో నాభిశిలా పునఃప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు ఎంతో ఉత్సాహంగా ప్రజలు జరుపుకొంటున్నారు. మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తుండటంతో గ్రామమంతా జనాలతో సందడిగా మారింది. ప్రతి ఇల్లు ఆడబిడ్డలతో, బంధువులతో కళకళలాడుతుంది. ఉత్సవాల్లో పాల్గొనేందుకు వివిధ రాజకీయ పక్షాల నేతలు, ప్రజాప్రతినిధులు గ్రామానికి వస్తున్నారు. ఆదివారం మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు గ్రామానికి తరలివచ్చి బొడ్రాయిని దర్శించుకున్నారు. కార్యక్రమం సర్పంచ్ బల్వంత్‌రెడ్డి, ఎంపీటీసీలు జ్యోతి, శ్రీశైలం, మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్, వివిధ రాజకీయ పక్షాల నేతలు ఉత్సవాల్లో పాల్గొంటున్నారు.

ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా విక్రమ్



నియామకపత్రం అందుకుంటున్న విక్రమ్

యాచారం: మండలంలోని నందివనపర్తికి చెందిన పెరుమళ్ల విక్రమ్‌ను బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమించారు. ఆదివారం జిల్లా అధ్యక్షుడు బచ్చిగళ్ల రమేష్ నియామకపత్రం అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు రమేష్ సూచించారు. కార్యక్రమంలో యాచారం మండల బీజేపీ అధ్యక్షుడు రవీందర్, నాయకులు వెంకట్‌రెడ్డి, రమేష్, విజయకుమార్, దయాకర్, కొండాపురం నాగరాజు, వెంకటేశ్, సురేష్, శ్రీకాంత్, శ్రీనువాస్ పాల్గొన్నారు.

రాజీవ్ సేవలు చిరస్మరణీయం



తలకొండపల్లిలో..



తుర్కయంజాల్‌లో..

దివంగత, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లోని రాజీవ్‌గాంధీ విగ్రహాలకు పూలమాలలతో ప్రజలు, ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళి అర్పించారు. పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. భారతదేశానికి ఐటీ రంగాన్ని తీసుకొచ్చి దేశాన్ని టెక్నాలజీ రంగంలో అగ్రస్థానంలో నిలిపిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. –సాక్షి, నెట్‌వర్క్



కడ్తాల్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



యాచారం: రాజీవ్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

రేపు మెగా వైద్య శిబిరం

తలకొండపల్లి: మండలంలోని చుక్కాపూర్ జిల్లా పరిషత ఉన్నత పాఠశాలల్లో ఎమిరెడ్డి మాధవరెడ్డి, భారతమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు రియలిస్టు పాండురంగారెడ్డి, ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 22న మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ పీఆర్‌ఓ పాషా, క్యాంపు చైర్మన్ ఏమిరెడ్డి శేఖర్‌రెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో దీర్ఘకాలిక, తాత్కాలిక రోగాలతో పాటు, జనరల్ వ్యాధులను పరీక్షించి మందులను పంపిణీ చేయనున్నారని పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గూడులేని పేదలకు ఆర్థిక సాయం

తలకొండపల్లి: ప్రకృతి వైపరీత్యాలకు కుదేలైన కుటుంబాలను ప్రముఖ సంఘ సంస్కర్త నారెడ్డి ప్రశాంత్‌రెడ్డి అండగా నిలబడ్డాడు. వర్షానికి కూలిపోయిన ఇండ్లను పరిశీలించి అర్హులకు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని జూలపల్లికి చెందిన ఎండీ జానీ ఇళ్లు ఇటీవల కురిసిన వర్షానికి కూలిపోయింది. ప్రశాంత్‌రెడ్డి ఆదివారం జూలపల్లికి వెళ్లి ఇంటిని పరిశీలించి తక్షణ సహాయంగా జానీకి నారెడ్డి ప్రశాంత్‌రెడ్డి రూ.15000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, యువకులు ఉన్నారు.

సమాజ సేవతోనే గుర్తింపు



కడ్తాల్: మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

కడ్తాల్: సమాజ సేవతోనే గుర్తింపు, గౌరవం లభిస్తాయని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ జన్మదినం పురస్కరించుకుని, మండల కేంద్రంలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డితో కలిసి జెడ్పీటీసీ మొక్కలు మొక్కలు నాటి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి కేక్ కట్ చేసి వేలాదిమందితో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్, అనితారెడ్డి మాట్లాడుతూ.. రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దశరథ్‌నాయక్ పేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కరోనా కష్టకాలంలో వేలాది మందికి నిత్యావసర సరుకులతో పాటు, వైద్య సేవలను అందించి పేద ప్రజలకు అండగా నిలిచారని ఆయన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గోలీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్‌లు ఈట గణేశ్, బాలాజీసింగ్, జెడ్పీటీసీలు విజితారెడ్డి, అనురాధ పత్యానాయక్, తస్వీరాజ్, విశాలరెడ్డి, మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్త, వైస్ ఎంపీపీ ఆనంద్, రైతు బంధు మండల అధ్యక్షుడు వీరయ్య, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహరెడ్డి, తులసీరాంనాయక్, ఎంపీటీసీలు లచ్చిరాం నాయక్, గోపాల్, ,మంజుల చంద్రమౌళి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్ ఉన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

తలకొండపల్లి: ఈ నెల 22న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సూపరిండెంటెంట్ శ్యాంసుందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉ.10.30 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్‌లా మొత్తం రుణమాఫీ చేయాలి

కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి



యాచారం: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసే రూ.లక్ష లోపు రుణమాఫీ వడ్డీలకే సరిపోవడం లేదని, పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2018కి ముందు రూ.లక్ష రుణం తీసుకున్న రైతుల బ్యాంకు అప్పులు ప్రస్తుతం రూ. 2 లక్షలు చేరిందన్నారు. రూ.లక్షలోపు మాఫీ వడ్డీలకే సరిపోదని ఆరోపించారు. ప్రభుత్వం రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని కోరారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీని ఒకేసారి అమలు చేస్తామన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డిలా రుణాలను ఒకేసారి మాఫీ చేయాలని చెప్పారు. ఒకేసారి మాఫీ చేసి వైఎస్ నేటికి రైతుల గుండెల్లో దేవుడిగా నిలిచాడని అన్నారు.

మండలాన్ని సాధించి తీరుతాం

వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి



దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు, తదితరులు

తలకొండపల్లి: మండలంలోని గట్టుఇప్పలపల్లిలో గత 49వ రోజులుగా దీక్షలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ఏ మాత్రం స్పందించడంలేదని వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం శ్రీనివాసురెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. మండల ఏర్పాటుకు కావాల్సిన వనరులు, సదుపాయాలు అన్ని ఉన్నా మండలం ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చిత్తశుద్ధి లోపించడం కారణంగానే మండలం ఏర్పాటు కావడం లేదని ఆరోపించారు. మండలం కావాలని ఇటీవల సర్పంచ్, ఉప సర్పంచ్‌లతో పాటు, వార్డు సభ్యులందరు మూకుమ్మడిగా రాజీనామాలు చేసినా ప్రభుత్వానికి ఎలాంటి చలనం లేదని వాపోయారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగమ్మ, మైసయ్య, దామోదర్, డేవిడ్, కృష్ణాజి, ఎల్లోజి, సర్పంచ్ జయమ్మ, వెంకటయ్య, చెన్నయ్య, ముత్యాలు, లింగయ్య, రేణురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

జవాన్ శేఖర్‌కు నివాళులు

షాద్‌నగర్‌రూరల్: వీరజవాన్ శేఖర్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని బీఆర్‌ఎస్ యువనాయకుడు మురళీయాదవ్ అన్నారు. లడ్డాఖ్‌లో ఆర్మీ వాహనం లోయలో పడిన ఘటనలో ఆదివారం వీరమరణం పొందిన జవాన్ శేఖర్ చిత్రపటానికి బీఆర్‌ఎస్ నాయకులు పట్టణ ముఖ్యకూడలిలో ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన ఆర్మీజవాన్ శేఖర్ అకాల మృతి బాధాకరమని అన్నారు. శేఖర్ మరణ వార్త కలచి వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ కొందూటినరేందర్, వైస్‌చైర్మెన్ ఎంఎస్ నటరాజ్, నాయకులు మన్నెనారాయణయాదవ్, లక్ష్మణ్‌నాయక్, వెంకట్‌రాంరెడ్డి, కిషోర్, సాయిప్రసాద్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



దశరథ్‌నాయక్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మంచాల: నియోజకవర్గంలోని ప్రజలందరికి అండగా ఉంటామని రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. లోయపల్లి గ్రామంలో ఇటీవల బీఆర్‌ఎస్ నాయకుడు కొర్ర దశరథ్‌నాయక్ తల్లి మరణించింది. ఆదివారం ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి దశరథ్‌నాయక్ కుటుంబ సభ్యులను పరమర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కష్టాల్లో ఉన్న ప్రజలకు తాము అండగా నిలుస్తామని తెలిపారు. కష్టాకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచి వారికి మనోధైర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్, యాచారం మండల అధ్యక్షుడు కె. రమేష్, మంచాల యువజన విభాగం మండల అధ్యక్షుడు వనపర్తి బద్రినాథ్ గుప్తా, నాయకులు పాల్గొన్నారు.

సీడబ్ల్యూసీలో వంశీచంద్‌రెడ్డికి స్థానం

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ హర్షం



కడ్తాల్: కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ)లో ప్రత్యేక ఆహ్వానితుడిగా, పార్టీ అధిష్టానం స్థానం కల్పించడం హర్షణీయమని, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికి పార్టీ అధిష్టానం గుర్తిస్తుందన్నారు. ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా, కల్వకుర్తి శాసనసభ్యుడిగా, మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీగా, ఏఐసీసీ కార్యదర్శిగా, మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా పార్టీ ఏ బాధ్యతలు అప్పగించిన, పార్టీకి విధేయుడిగా ఉంటూ సమర్థవంతంగా పార్టీ అభివృద్ధికి వంశీచంద్‌రెడ్డి కృషి చేశారని అన్నారు. పార్టీలో ఉన్నత బాధ్యతలు అప్పగించడం పట్ల, కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల తరపున పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలపడంతో పాటు, వంశీచంద్‌రెడ్డికి ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాల ఉత్సవాలు

ఇబ్రహీంపట్నం రూరల్: మండలంలోని ఎల్మినేడులో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. భారీ ఊరేగింపుగా మహిళలు బోనాలు ఎత్తుకుని ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు తీసుకెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ ఎడ్మా అశోకవర్ధన్‌రెడ్డిలు పాల్గొన్నారు.



పోచమ్మ బోనాల ఊరేగింపు

ట్రాఫిక్ ఇక్కట్లు

- నాలుగు లేన్ల రహదారిగా మారినా తప్పని ఇబ్బందులు
- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్
- నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్



రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

యాచారం: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువైంది. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కృషితో మూడేళ్ల కింద సాగర్‌రోడ్డు విస్తరణలో భాగంగా యాచారం మండల కేంద్రంలో డివైడర్‌తో పాటు నాలుగు లైనల రహదారిగా మారింది. రోడ్డు విస్తరణతో ఇక మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఉండదని అంతా భావించారు. కొన్నాళ్ల పాటు ట్రాఫిక్ సమస్య లేదు.. ప్రస్తుతం మళ్లీ పాత పద్ధతే కొనసాగుతోంది. రెండు, మూడేళ్ల కాలంలో యాచారం మండల కేంద్రం వ్యాపారపరంగా ఎంతో అభివృద్ధి చెందింది. వ్యాపారులు పెద్ద, పెద్ద బంగ్లాలు నిర్మించడంతో పాటు హోటళ్లు, బట్టల దుకాణాలు, హార్డ్‌వేరు తదితర వ్యాపార సంస్థలు పుట్టుకొచ్చాయి. దీంతో మళ్లీ ట్రాఫిక్ సమస్య మొదటి కొచ్చింది. కార్లు, బైకులను రోడ్డుపైనే నిలుపుతున్నారు. సాగర్‌రోడ్డుపై నిత్యం వేలాది వాహనాల రాకపోకలు సాగిస్తాయి. అంబేడ్కర్ చౌరస్తా నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు వరకు రోడ్డుకు ఇరువైపులా వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు.

అంబేడ్కర్ చౌరస్తా వద్దే బస్‌స్టాప్..

సాగర్‌రోడ్డుపై యాచారం మండల కేంద్రంలో ఆర్టీసీ బస్‌స్టాప్ ఉన్నప్పటికీ ఆర్టీసీ డ్రైవర్లు అంబేడ్కర్ చౌరస్తా వద్దనే బస్సులు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటూ..దించుతున్నారు. చౌరస్తాకు ఇరువైపులా దుకాణాలు ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్యకు తోడు ఆర్టీసీ బస్సులు నిలపడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. రూ. 25 లక్షల నిధులతో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లి, వచ్చేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటే తప్ప ప్రయాణికుల ఇబ్బందులు తప్పవు. ఆ దిశగా అధికారులు కృషి చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. యాచారం మండల కేంద్రంలో 20 ఏళ్ల కింద ఆర్టీసీ బస్టాండ్‌ను నిర్మించారు. ఆ రోజుల్లో బస్టాండ్‌కు సమీపంలో ఇంటి నిర్మాణాలు జరగలేదు. ప్రస్తుతం బస్టాండ్ సమీపం, చుట్టు పక్కల ఇంటి నిర్మాణాలు, వ్యాపార దుకాణాలు వెలిశాయి. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను వాడుకలోకి తీసుకురావాలి. అలాగే, పోలీస్ అధికారులు, గ్రామ పంచాయతీ రోడ్డుపై అక్రమ నిర్మాణాలను తొలగించి, వాహనాలను రోడ్డుపైన పార్కింగ్ చేయకుండా చూడాలి.



నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండ్

అక్రమ నిర్మాణాలు తొలగిస్తాం



మండల కేంద్రంలో రోడ్డుపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం. వాహనాలు రోడ్డుపైన ఆపకుండా పోలీసులు కృషి చేయాలి. ఆర్టీసీ అధికారులను కలిసి బస్టాండ్‌ను వాడుకలోకి తెచ్చేలా కృషి చేస్తా. చిరు వ్యాపారులు కూడా రోడ్డుపై ఉండకుండా చూడాలి.

– ముదిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్, యాచారం

అందరి సహకారంతోనే అభివృద్ధి

అంటువ్యాధులు సోకకుండా ప్రత్యేక చర్యలు

ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్



ఇబ్రహీంపట్నం: ప్రజాప్రతినిధుల, ప్రజల, అధికారుల భాగస్వామ్యంతోనే మున్సిపాలిటీ వేగవంతంగా అభివృద్ధి చెందుతుందని ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ పి. రవీంద్రసాగర్ తెలిపారు. పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచి వ్యాధులు ప్రబలకుండా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టుతున్నట్లు చెప్పారు.

'సాక్షి'తో మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ ఇంటర్వ్యూ.

పశ్న: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ విస్తీర్ణం ఎంత? వార్డులెన్ని, కాలనీలెన్ని?

జవాబు: 48 స్కేర్ కిలోమీటర్లు, 24 వార్డులు. 35 కాలనీలున్నాయి.

పశ్న: మున్సిపాలిటీలో ఎంత మంది ఓటర్లు, జనాభా ఎంత?

జవాబు: ప్రస్తుత అంచనా ప్రకారం 30, 693 మంది ఓటర్లు, సుమారు 40 వేల జనాభా.

పశ్న: ఎంతమంది శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

జవాబు: 98 మంది.

పశ్న: చెత్త సేకరణకు ఎన్ని వాహనాలున్నాయి?

జవాబు: 10 ఆటోలు, 4 ట్రాక్టర్లు.

పశ్న: పారిశుధ్య నివారణ ఎలా సాగుతోంది?

జవాబు: ప్రతిరోజు అన్నివార్డుల్లో చెత్తచెదారాన్ని సిబ్బంది తొలగిస్తున్నారు. పారిశుధ్య సిబ్బందిపై పర్యవేక్షణ ఉంటుంది. ప్రతినిత్యం 8 మెట్రిక్ టన్నుల చెత్తను డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నాం.

పశ్న: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు పడుతున్నారు.?

జవాబు: అంటు వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మలేరియా, డెంగూ, సీజనల్ ఫీవర్స్ సోకితే వెంటనే మున్సిపల్ సిబ్బందికి తెలియజేయాలి. స్థానిక వైద్యశాలల్లో చికిత్స చేయించుకోవాలి. దోమల, ఈగల నివారణకు ఫాగింగ్ చేస్తున్నాం. మురుగునీరుపై లార్వా ఉత్పత్తికాకుండా కెమికల్స్‌ను, చెత్త ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లిస్తున్నాం.

పశ్న: మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు ఏలా ఉన్నాయి?

జవాబు: 46 కి.మీటర్ల సీసీ రోడ్లు, 12 కి.మీటర్ల బీటీ రోడ్లు, 18 కి.మీటర్ల మట్టి రోడ్లు ఉన్నాయి.

పశ్న: మురికి కాలువలు ఏవిధంగా ఉన్నాయి.

జవాబు: 25 కి.మీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, 5 కి.మీటర్ల రబ్బ, 5 కి.మీటర్ల సీసీతో నిర్మించిన మురికికాలువలున్నాయి. చెత్తచెదారం, మురికి పేరుకుపోకుండా ప్రతినిత్యం శుభ్రం చేయిస్తున్నాం.

పశ్న: ప్లాస్టిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.?

జవాబు: ప్లాస్టిక్‌నియంత్రణకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అనుకుంటున్నాం. వ్యాపారుస్తులకు, కాలనీవాసులకు ప్లాస్టిక్‌పై చైతన్యం కల్పిస్తాం. ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరం.